నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 | SURYAPET

నడిగూడెంలో గండ్లు మిగిల్చిన నష్టం

నడిగూడెం : భారీ వర్షాలతో నడిగూడెం మండలంలో పంటలు దెబ్బతిన్నాయి. వరదకు పంట పొలాల్లో ఇసుక మేటలు, రాళ్లు వచ్చి చేరాయి. చాలా చోట్ల పత్తి నేల వాలింది. ఈ ఏడాది తమకు అనుకూలంగా ఉంటుందని భావించిన అన్నదాతలకు కష్టాలే మిగిల్చాయి. అనే గ్రామాల్లో రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. కాగిత రామచంద్రాపురంలోని రంగుల బ్రిడ్జి వద్ద సాగర్ ఎడమ కాల్వలకు రెండు గండ్లు పడడంతో సుమారు 300 ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారు.

నడిగూడెం : గుంతలమయంగా మారిన నడిగూడెం, రత్నవరం రహదారి

వరద బాధితులకు తక్షణ సాయమేది?

సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించి ఆరు రోజులవుతున్నా పత్తాలేదు

- ఇద్దరు మృతుల కుటుంబాలకు చెక్కులు ఇచ్చి చేతులు దులుపుకొన్న అధికారులు
- కనీసం నిత్యావసర సరుకులకూ నోచుకోని వందలాది బాధిత కుటుంబాలు
- మంత్రి, ఎమ్మెల్యేలు వట్టి చేతులతోనే పరామర్శలు

సూర్యాపేట, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదై భీకరంగా ప్రవహించిన వరదలతో అతలాకుతలమై సర్వం కోల్పోయిన బాధితులకు స్వయానా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన సాయం అందలేదు. బాధితులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని, తక్షణ సాయం కోసం కలెక్టర్ బ్యాంకు ఖాతాకు రూ.5 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ఇద్దరు మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున అందించారు తప్ప ఇతర బాధితులకు అందింది శూన్యం. తక్షణ సాయం అంటే గంటల్లో అందిస్తారు.. కానీ ఆరు రోజులైనా అందదా అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి, కోదాడ, హుజూర్నగర్ ప్రాంతాల్లోని వందల ఇండ్లలోకి నీళ్లు చేరి నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులన్నీ తడిసి ముద్దయ్యాయి. వేలాది ఎకరాల్లో పత్తి, వరి ఇతర పంటలు నేలపాలు కాగా వందలాది ఎకరాల పొలాల్లో ఇసుక, మట్టి మేటలు పేరుకుపోయాయి. ఇది జరిగి ఆరు రోజులు గడుస్తుండగా సర్వం కోల్పోయి ఆకలితో అలమటిస్తున్న వరద బాధితులను ఎవరు పరామర్శించేందుకు వచ్చినా తమకు కనీసం తాగునీరు, భోజనాలు అందించాలని కోరుతున్నారు. అయినా స్పందించిన నాథుడే కరువయ్యారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి వట్టి చేతులతో పర్యటించారు తప్ప ఎలాంటి సాయం చేయలేదు. గత నెల 31న కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలతోపాటు తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని మద్దిరాల, అర్వపల్లి తదితర మండలాల్లో 25 నుంచి 35 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైన విషయం తెలిసిందే.


నూతనకల్ మండలం గుండ్ల సింగారం కత్వా కింద పొలాల్లోకి చేరిన ఇసుక మేట

భోజనాలు సమకూర్చిన బంధువులు, స్థానికులు

సూర్యాపేట జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో వరదల కారణంగా దాదాపు 3వేలకు పైనే ఇండ్లలోకి మూడు ఫీట్ల నుంచి ఆరు ఫీట్ల వరకు నీరు చేరి వస్తువులన్నీ తడిసి మద్దయ్యాయి. దీంతో ఆయా ఇండ్లల్లో నివాసం ఉంటున్న వారి పరిస్థితి అంధకారంగా, అగమ్యగోచరంగా మారింది. ఇంటిని చూస్తుంటే దుఃఖం వస్తుందని, ఆకలైతే దిక్కులు చూసే పరిస్థితి దాపురించిందని పలువురు బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వ పరంగా ఏదో ఒకటి అందుతుందని అనుకున్నామని, ఐదు రోజులు గడిచినా ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి పోతున్నారు తప్ప పట్టించుకోవడం లేదని అంటున్నారు. బంధువులు, స్థానికులే బాధితులకు ఆహారం అందిస్తున్నారు.

వరద తాకిడికి కోతకు గురైన గుండ్లసింగారం బ్రిడ్జి

ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్ దండుమైసమ్మ ఆలయం వద్ద..

ఇంకా బాధితులను గుర్తిస్తున్న అధికారులు

వరద బాధితులకు వెంటనే రూ.10వేల చొప్పున ఆర్థిక సాయం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగా ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. వరదల్లో చనిపోయిన రెండు కుటుంబాలకు చెక్కులు ఇచ్చారు. కానీ పశువులు, మేకలు చనిపోయిన కుటుంబాలతో పాటు పూర్తిగా ఇండ్లు కూలిన వారికి, పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్లకు, వరదల్లో ఇండ్లలోకి నీరు చేరి సర్వం కోల్పోయిన వారికి సాయం అందలేదు. ఆరు రోజులవుతున్నా సాయం లేకపోగా ప్రస్తుతం బాధితులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఈ విషయమై కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణను వివరణ కోరగా బాధితులను గుర్తించేందుకు సర్వే పూర్తి కావచ్చిందని, నేడో రేపో బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తామని చెప్పారు.

బురదమయంగా ఇండ్లు, వీధులు

- గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం

అనంతగిరి మండలం గొండ్రియాలలో ఓ ఇంట్లో చేరిన బురద

గొండ్రియాల గ్రామంలోని రహదారిపై చేరిన బురద

కోదాడ, సెప్టెంబర్ 5 : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలకు అతలాకుతలమైన కోదాడ నియోజకవర్గ ప్రజలు ఇంకా తేరుకోలేదు. నియోజకవర్గంలోని ఆరు మండలాలతోపాటు కోదాడ పట్టణాన్ని వరద ముంచెత్తగా జన జీవనం పూర్తిగా స్తంభించింది. 13,476 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లగా రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అనంతగిరి, కోదాడ మండల్లాలోని గోండ్రియాల, చిమిర్యాల, తొగర్రాయి, కూచిపూడి తదితర గ్రామాల్లో వరదకు ఇండ్లలోకి నీరు చేరగా ప్రజలు ఇప్పుడిప్పుడే బయటికి వస్తున్నారు. రోడ్లు ధ్వంసమవడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. వరద వచ్చి నాలుగు రోజులైనా పలు ఇండ్లలో నీరు, బురద అలాగే ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. వీధుల్లోనూ చెత్తాచెదారం, బురద పేరుకుపోయి పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని ఆందోళన చెందుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టడం లేదని, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. వరద బాధితులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి గోడలు కూలాయి.. ఎవరూ సాయం చేయలేదు

భారీ వర్షానికి వరద ఇంట్లోకి వచ్చి గోడలు కూలిపోయాయి. బియ్యం, పప్పులు నీటిపాలయ్యాయి.. ఇప్పటి వరకు మా బాధలు పట్టించుకున్న వారే లేరు. కూలిపోయిన ఇంటిని బాగు చేసుకునేందుకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి.

– ఎస్‌కే ఖాజాబీ మాతానగర్, కోదాడ

పాలకవీడు : వరద ప్రభావంతో దెబ్బతిన్న రాఘవపురం లోలెవల్ బ్రిడ్జి

పాలకవీడు మండలంలో రోడ్లు ధ్వంసం

పాలకవీడు : భారీ వర్షానికి పాలకవీడు మండలంలో రోడ్లు, వంతెనలు దెబ్బతిన్నాయి. పంట పొలాలు నీట మునిగి ఇసుక మేటలు వేశాయి. విద్యుత్ వ్యవస్థ అగమాగమైంది. రాఘవపురం, కల్మటితండా, శూన్యపహాడ్-దామరచర్ల రహదారిలో మూసీ నదిపై ఉన్న లో లెవల్ వంతెనలు దెబ్బతిన్నడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో మీగడంపహాడ్ తండాలో నిర్మించిన వైకుంఠధామం పూర్తిగా దెబ్బతిన్నది. రావిపహాడ్, మహంకాళీగూడెం గ్రామాల్లో వరి, పత్తి పంటలు నీట మునిగాయి. వరద ప్రభావంతో మండల వ్యాప్తంగా 50 విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. 10 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరర్లు నీట మునగగా, 5 కిలోమీటర్ల మేర విద్యుత్ తీగలు ధ్వంసమయ్యాయి. మహంకాళీగూడెం వద్ద కృష్ణానది ఉగ్ర ప్రవాహంతో ఐదు రోజులుగా చేపలు పట్టకపోవడంతో జాలర్లు ఉపాధి కోల్పోయారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

వేమూలూరి వాగు ప్రవాహంతో పంటలకు తీవ్ర నష్టం కలిగింది. కరెంట్ స్తంభాలు విరగడంతో సరఫరా లేక ఇబ్బంది పడ్డాం. రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– భూక్యా రవినాయక్, మీగడంపహాడ్ తండా, పాలకవీడు

పక్కా ప్రణాళికతో విద్యా వ్యవస్థ పటిష్టం

- టీచర్లు పట్టుదలతో పని చేస్తే విద్యార్థులు ఆణిముత్యాలుగా తయారవుతారు
- ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ప్రభుత్వ విద్యపై విశ్వాసం పెంచేలా టీచర్లు పనిచేయాలి : రాజ్యసభ సభ్యుడు కోడూరి విశ్వవిజయేంద్రప్రసాద్
- 155 మంది జిల్లా ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డుల అందజేత

నల్లగొండలో ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయేంద్రప్రసాద్, ఎంపీలు రఘువీర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీరేశం, బీఎల్‌ఆర్, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

రామగిరి, సెప్టెంబర్ 5 : ప్రభుత్వ పాఠశాలలను సందర్శించినప్పుడు దేవాలయాలను సందర్శించిన అనుభూతి కలుగుతుందని, అందుకే గురువులు దేవునితో సమానమని, ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతో మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నల్లగొండలోని జీఎం ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథుగా మంత్రి కోమటిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు, కవి, రచయిత కోడూరి విశ్వవిజయేంద్రప్రసాద్‌తో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం కోమటిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వ విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని, కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల కంటే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉందని తెలిపారు. ఇలాంటి పరిస్థితులు మారాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకెళ్తుందని చెప్పారు. ఉపాధ్యాయులు తమ సొంత పిల్లల మాదిరిగా విద్యార్థులను చదివిస్తే ఆణిముత్యాల లాంటి ఉత్తమ పౌరులను తయారు చేయవచ్చని అన్నారు. రాజ్యసభ సభ్యుడు కోడూరి విశ్వవిజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థపై విశ్వాసం పెంచేలా ఉపాధ్యాయులు పనిచేయాలన్నారు. 'నేను నుంచి మన' అనే మనస్తత్వాన్ని విద్యార్థుల్లో కల్పించాలని తెలిపారు. ఢిల్లీలో పబ్లిక్ స్కూల్స్‌లో సీటు దొరుకడం లేదని, అదే పరిస్థితి అన్ని ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. నల్లగొండ ఎంపీ కుందూరి రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నకిరేకల్, మిర్యాలగూడ, తుంగతుర్తి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీఎల్‌ఆర్, మందుల సామేల్ మాట్లాడుతూ ప్రపంచాన్ని నిర్మించే శక్తి ఉపాధ్యాయులకు ఉందని, రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ తాను ఉపాధ్యాయుడిగా పనిచేసిన తర్వాత ఈ స్థాయికి వచ్చానని గుర్తు చేశారు.

మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు అభ్యసన సామర్థ్యాలు, బోధన సామగ్రితో బోధన అందించాలని తెలిపారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 155 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ అవార్డులు, ప్రశంసా పత్రాలు అందించి సన్మానించారు. వేడుకలో బాలు మాస్టార్ శిష్య బృందం చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు టి.పూర్ణచంద్ర, జె.శ్రీనివాస్, డీఈఓ బి.భిక్షపతి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్ గౌడ్, ఆర్డీఓ రవి, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి ఆర్.రామచయంద్రయ్య, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులంటే వీరేనా !

జిల్లా కేంద్రంలోని జీఎం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ మాట్లాడుతున్న సందర్భంలో సభలో ఉన్న ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా ముచ్చట్లులో మునిగిపోయారు. దీంతో డీఈఓ భిక్షపతి వేదికపై నుంచి కల్పించుకుని ఉపాధ్యాయులంతా నిశ్శబ్దం పాటించాలని పలు పర్యాయాలు విజ్ఞప్తి చేశారు. అప్పటికీ టీచర్లు క్రమశిక్షణ లేకుండా వ్యవహరించారు. మరోవైపు వేదికపై సన్మాన సమయంలో ఉపాధ్యాయులు గుంపులుగా రావడతో కింద కూర్చున్న వారికి ఏం జరుగుతుందో తెలువని పరిస్థితి చోటుచేసుకుంది. ఉపాధ్యాయుల కార్యక్రమం ఇలానా అని పలువురు విమర్శలు చేయడం కనిపించింది.

అవార్డుల ఎంపికలో అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

జిల్లా వ్యాప్తంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు వచ్చిన దరఖాస్తుల్లో బుధవారం రాత్రి వరకు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆమోదంతో 130 మంది జాబితాను డీఈఓ భిక్షపతి విడుదల చేశారు. పలు ఉపాధ్యాయ సంఘాల నేతల పైరవీతో తొలి జాబితా కాకుండా మరో 25మందిని అనధికారికంగా ఎంపిక చేసి అవార్డులు అందజేశారు. ఇది పూర్తిగా జిల్లా విద్యాశాఖ అధికారుల తప్పిదమేనని ఉపాధ్యాయులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేడుకకు హాజరైన కలెక్టర్ నారాయణరెడ్డికి పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు దీనిపై ఫిర్యాదు చేశారు.

మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామ సమీపంలో ఉన్న తడకమళ్ల హెడ్ రెగ్యులేటర్ పాయింట్

అన్నదాత ఆశలకు గండి

- నడిగూడెం వద్ద సాగర్ ఎడమ కాల్వకు గండి.. నీటి విడుదల బంద్
- దుక్కులు దున్ని నాట్లకు సిద్ధం చేసుకున్న ఆయకట్టు రైతులు
- గండి పూడ్చే వరకు మరో వారం రోజులు.. ఆందోళనలో అన్నదాతలు
- తడకమళ్ల హెడ్ రెగ్యులేటర్ వరకు నీళ్లివ్వాలని వినతి

మిర్యాలగూడ, సెప్టెంబర్ 5 : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద ఉన్న మేజర్ల ద్వారా సాగునీరు చివరి భూములకు చేరక రైతులు ఇంతకాలం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరుణుడు కరుణించడంతో మేజర్ల కింద చివరి భూములకు నీరు చేరింది. రైతులు సంతోషంగా దుక్కులు దున్ని నాట్లకు సిద్ధం చేసుకున్నారు. ఈ దశలో నడిగూడెం వద్ద సాగర్ ఎడమ కాల్వకు గండి పడడంతో నీటి విడుదల నిలిపివేశారు. దాంతో మేజర్ల కింద చివరి భూముల రైతుల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. గండి పూడ్చే వరకు మరో వారం రోజులుపైనే పట్టే అవకాశం ఉన్నందున దుక్కులు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైతులే పూడిక తీయించుకున్నారు..

మిర్యాలగూడ నియోజకవర్గం పరిధిలో వజీరాబాద్, ముల్కలకాల్వ కిష్టాపురం, చిల్లాపురం, తడకమళ్ల, తక్కెళ్ల పాడు, యాద్గార్‌పల్లి సాగర్ ఎడమ కాల్వ మేజర్ కాల్వలకు ప్రభుత్వం పూడికలు తీయించకపోవడంతో రైతులే సొంతంగా తీయించుకున్నారు. సాగర్ నుంచి నీటి విడుదలతో చివరి భూములకు సాగునీరు అందుతుందని ఆశించారు. కానీ మళ్లీ గండి పడడంతో నిరాశే మిగిలింది.

ఎన్ఎస్పీ అధికారుల నిర్లక్ష్యంతోనే గండ్లు

సాగర్ ఎడమ కాల్వ కట్టలను పర్యవేక్షించేందుకు కిలోమీటర్ల వారీగా పలువురు అధికారులు తరుచుగా మానిటరింగ్ చేస్తుంటారు. కాల్వకు గండ్లు పడే పరిస్థితి ఉన్న దశలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఎన్ఎస్పీ అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతోనే కాల్వలకు గండ్లు పడుతున్నాయని రైతులు మండిపడుతున్నారు. గతేడాది కూడా నిడమనూరు వద్ద ఎడమ కాల్వకు గండి పడి రైతులు ఇబ్బందులు పడ్డారు.

తడకమళ్ల వరకు నీళ్లిచ్చే అవకాశం

నడిగూడెం వద్ద గండి పడడంతో ప్రస్తుతం సాగర్ ఎడమ కాల్వకు నీటిని బంద్ చేశారు. ఈ దశలో మిర్యాలగూడ మండలం తడకమళ్ల హెడ్ రెగ్యులేటర్ల వరకు సాగునీరు అందించే పరిస్థితి ఉందని, హెడ్ రెగ్యులేటర్లను కిందికి దింపి నీటిని విడుదల చేసినట్లయితే పంటలకు ప్రయోజనం చేకూరుతుందని రైతులు కోరుతున్నారు.

బూరుగడ్డ చెరువులో నుంచి నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

కట్ట తెగింది.. దారి పోయింది..

ఇటీవల భారీగా కురిసిన వర్షాలకు హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలోని నల్లచెర్వు ఉప్పొంగి గండి పడింది. దాంతో గోపాలపురం-బూరగడ్డ గ్రామాల మధ్య ఉన్న నల్లచెర్వు కట్ట తెగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు తగ్గినా రహదారి పునరుద్ధరణ పనులు నెమ్మదిగా సాగుతుండగా .. సమీప గ్రామాల ప్రజలు, విద్యార్థులు చెరువులో నుంచే నడుచుకుంటూ వెళ్తున్నారు. అధికారులు స్పందించి రహదారి మార్గాన్ని త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 5


శాలిగౌరారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలివ్వాలి

- తాసీల్దార్ కార్యాలయం ఎదుట లబ్ధిదారుల ధర్నా

శాలిగౌరారం, సెప్టెంబర్ 5 : మండలంలోని తక్కెళ్లపహాడ్‌లో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు అందించాలని కోరుతూ లబ్ధిదారులు గురువారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ తక్కెళ్లపహాడ్ గ్రామంలో గత ప్రభుత్వం 28 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించిందన్నారు. గతేడాది అప్పటి తాసీల్దార్ పాల్‌సింగ్ గ్రామంలో ఇండ్లు లేని నిరుపేదల నుంచి దరఖాస్తులు స్వీకరించి, గ్రామ సభలో డ్రా పద్ధతిన 28మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో ఇండ్ల పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలు కావస్తున్నా నేటికీ లబ్ధిదారులకు పట్టాలు అందించలేదన్నారు. తామంతా ఇండ్లు లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే ఇండ్ల పట్టాలను అందించాలని కోరారు. అనంతరం తాసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.

జల పరవళ్ల గుండ్ల సింగారం

ఇటీవల కురిసిన వర్షాలకు నూతనకల్ మండలంలోని గుండ్ల సింగారం కత్వా అలుగుపోస్తూ చూపరులను కట్టిపడేస్తున్నది. జాలువారుతున్న జలాలు ఆహ్లాద అనుభూతినిస్తున్నాయి.

– సూర్యాపేట నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్